

హరివంశము
అయలసోమయాజులనీలకంఠేశ్వర
జగన్నాథశర్మ

# విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | సంగ్రహసృష్టి వివరణ:దితి గర్భచ్ఛేదన | ..... | 09 |
| 2. | వేనుని శరీరమథనం:పృథుదేవతల సంవాదం | ..... | 14 |
| 3. | మన్వంతరాలు:వైవస్వతమనువు జననం | ..... | 18 |
| 4. | రేవతీ ప్రదానం:ఉదంకుని వేడుకోలు | ..... | 23 |
| 5. | త్రిశంకుడు: సగరుడు | ..... | 27 |
| 6. | పితృదేవతలు:పూజలు:ప్రభావాలు | ..... | 31 |
| 7. | కౌశికపుత్ర చరిత్ర:ఉగ్రాయుధసంహారం | ..... | 36 |
| 8. | కౌశికపుత్రుల హీనజన్మవృత్తాంతం | ..... | 40 |
| 9. | తారాశశాంకం:రజిరాజు చరిత్ర | ..... | 45 |
| 10. | యయాతి సుభాషితాలు:జాహ్నవి జన్మవృత్తాంతం | ..... | 49 |
| 11. | యదువంశం:అరణ్యకన్య కథ | ..... | 55 |
| 12. | శ్యమంతకమణి:జాంబవతి | ..... | 59 |
| 13. | శతధన్వుని సంహారం:అక్రూరుని మహిమ | ..... | 63 |
| 14. | వరాహ నారసింహ అవతారాలు | ..... | 68 |
| 15. | వామనావతారం:దేవదానవుల సంగ్రామం | ..... | 72 |
| 16. | దేవదానవుల యుద్ధం:బడబాగ్ని జననం | ..... | 77 |
| 17. | కాలనేమి సంహారం:విష్ణుదేవుని యోగనిద్ర | ..... | 81 |
| 18. | భూదేవి విజ్ఞప్తి: శంతనుని జననం | ..... | 86 |
| 19. | కంసుడుగా కాలనేమి:వసుదేవుడుగా కశ్యపుడు | ..... | 91 |
| 20. | బలరామకృష్ణుల జననం | ..... | 95 |
| 21. | వ్రేపల్లె జీవనం:పూతన సంహారం | ..... | 100 |
| 22. | శకటాసుర సంహారం:గోపికల మొర | ..... | 103 |
| 23. | చిన్నికృష్ణుని చిలిపి చేష్టలు:యశోద ఆనందాలు | ..... | 108 |
| 24. | కూలిన మద్దిచెట్లు:పెరిగి పెద్దయిన బలరామకృష్ణులు | ..... | 113 |
| 25. | వేసవి విజృంభణ:శంఖకర్ణుని హితోపదేశం | ..... | 117 |
| 26. | కపిత్థవృక్షనిర్మూలన:బకాసుర సంహారం | ..... | 122 |
| 27. | శ్రీకృష్ణమాయ:బ్రహ్మదేవుని గర్వభంగం | ..... | 126 |
| 28. | కాలనేమి పుత్రులు:కకావికలు | ..... | 130 |
| 29. | సప్తవృషభసంహారం:నీలస్వీకరణ వైనం | ..... | 135 |
| 30. | కాళీయుని బంధనం:యశోద విషాదం | ..... | 139 |
| 31. | ధేనుకాసుర సంహారం | ..... | 144 |

32. ప్రలంబాసుర సంహరణ:పర్వతార్చన ..... 149
33. మహేంద్రుని దురాగ్రహం:గోవర్ధనోద్ధరణ ..... 153
34. కృష్ణుని అభిషేకం:దావాగ్ని నివారణ ..... 157
35. హేమంత ప్రవేశం:గోపికా వస్త్రాపహరణం ..... 162
36. విప్రవనితల అన్నప్రదానం:మోహావేశం ..... 167
37. నంద సంరక్షణ:గోపికల అన్వేషణ ..... 171
38. కృష్ణుని రాసక్రీడ:గోపికల జలక్రీడ ..... 176
39. శంఖచూడసంహారం:కంసుని మంత్రాలోచనం ..... 181
40. కంసుని మంత్రాలోచన:అక్రూర ప్రేరణ ..... 185
41. కేశితో సంగ్రామం:వ్యోమాసుర సంహారం ..... 189
42. శ్రీమన్నారాయణ సందర్శనం:శ్రీకృష్ణుడు మధురప్రవేశం ..... 194
43. కమనీయం కుబ్జకథ:కంసధనుర్భంగం ..... 198
44. కంసుని జన్మవృత్తాంతం:సంహారం ..... 203
45. కంసపత్నులవిలాపం:ఉగ్రసేనుని పట్టాభిషేకం ..... 208
46. బలరామకృష్ణుల విద్యాభ్యాసం:గురుదక్షిణ సమర్పణ ..... 212
47. వ్రేపల్లెకు ఉద్ధవునిరాక:గోపికల ఆర్తి ..... 216
48. అక్రూరుని హితోపదేశం:జరాసంధుని యుద్ధసన్నాహం ..... 221
49. బలరామకృష్ణుల నిష్క్రమణ:గోమంత సందర్శనం ..... 226
50. జరాసంధుని దండయాత్ర:గోమంత దహనం ..... 231
51. కృష్ణుని వీరావేశం:జరాసంధుని పలాయనం ..... 235
52. సృగాలవాసుదేవుని సంహారం:మధురప్రవేశం ..... 240
53. జరాసంధ–బలరామకృష్ణుల యుద్ధం ..... 244
54. బలరామ జరాసంధుల గదాయుద్ధం ..... 249
55. బలరాముని కాళిందీభేదనం:మధుర ప్రవేశం ..... 253
56. కృష్ణుని మాయోపాయం:కాలయవనుని మృతి ..... 257
57. ద్వారకానగర నిర్మాణం:సుధర్మ సమర్పణం ..... 261
58. రుక్మిణీ కల్యాణం:విప్ర రాయబారం ..... 265
59. రుక్మిణీహరణం:క్షత్రియుల తిరుగుబాటు ..... 270
60. రుక్మిణీకల్యాణం:ప్రద్యుమ్న జననం ..... 275
61. ప్రద్యుమ్నుని పరిణయం:రుక్మి బలరాముల ద్యూతక్రీడ ..... 279
62. నరకాసుర విజృంభణ:దేవేంద్ర పరాజయం ..... 284
63. నరకాసురుని దుశ్చర్యలు:కృష్ణుణ్ణి సందర్శించిన మునులు ..... 289
64. మునుల వేడుకోలు:మురాసురాదుల సంహారం ..... 292
65. సత్యభామా నరకాసురుల యుద్ధం: అసుర సంహారం ..... 296

66. దేవకన్యల స్వీకరణం:పారిజాతాపహరణం ..... 301
67. శ్రీకృష్ణమహిమాభివర్ణన:మహరాజుల సందర్శన ..... 305
68. శ్రీకృష్ణ మహిమ:నారదుని కథనం ..... 309
69. మృతపుత్రుల ప్రదానం:రుక్మిణి సంతానాపేక్ష ..... 314
70. కృష్ణుని కైలాసయాత్ర:యోగసమాధినిష్ఠ ..... 319
71. ఘంటాకర్ణుని వేదన:శ్రీకృష్ణ కృప ..... 323
72. శ్రీకృష్ణ సందర్శనం:పరమేశ్వర సాక్షాత్కారం ..... 327
73. శ్రీకృష్ణమహిమాభివర్ణన:పౌండ్రక వాసుదేవుని దండయాత్ర ..... 332
74. పౌండ్రకుని దండయాత్ర:సాత్యకి యుద్ధం ..... 336
75. ఏకలవ్య బలరాముల సంగ్రామం:శ్రీకృష్ణుని రాక ..... 341
76. శ్రీకృష్ణుని ప్రస్థానం:పౌండ్రకుని వధ ..... 345
77. కృత్యాసంహారం:బాణాసురుని గర్వోక్తులు ..... 349
78. కుంభాండుని సంభాషణ:ఉషా పరిణయం ..... 354
79. ఉషానిరుద్ధుల సమాగమం:చిత్రపట దర్శనం ..... 358
80. అనిరుద్ధుని కులశీలవర్ణన:చిత్రరేఖ తామసీవిద్య ..... 362
81. ఉషానిరుద్ధుల సమాగమం:రాక్షసవీరుల సంగ్రామం ..... 367
82. బాణాసుర విజృంభణ:నాగపాశ ప్రయోగం ..... 371
83. శ్రీకృష్ణ బలరాముల పర్యాలోచన:నారదుని ఆగమనం ..... 376
84. గరుత్మంతుని శ్రీకృష్ణస్తుతి:శ్రీకృష్ణుని శోణపుర ప్రస్థానం ..... 380
85. బలరామకృష్ణుల విజృంభణ:జ్వరపరాజయం ..... 385
86. శివదేవుని యుద్ధవిరమణ:కుమారస్వామి విజృంభణ ..... 390
87. బాణాసుర పరాజయం:పార్వతీదేవి పరిరక్షణ ..... 394
88. బాణునికి వరప్రదానం:అదృశ్యమైన గోధనం ..... 399
89. వరుణుడితో పోరాటం:కృష్ణుని ద్వారక ప్రవేశం ..... 404
90. వ్యాసుని భావికాల ధర్మవివరణ:కలియుగాచార వివరణ ..... 408
91. విశ్వావసువు హితోపదేశం:మార్కండేయచరిత్ర ..... 413
92. మధుకైటభ సంహారం: ఆదివరాహచరిత్ర ..... 418
93. హిరణ్యాక్ష సంహారం:నృసింహ ప్రాదుర్భావం ..... 423
94. నృసింహదేవుని వీరవిహారం:వామనావతారచరిత్ర ..... 427
95. అగ్నిదేవుని దహనం:బలీంద్రుల సంగ్రామం ..... 432
96. వామనమూర్తి పుట్టుక:ఇంద్రాది దేవతల ప్రార్థన ..... 437
97. మహామూర్తిగా వామనమూర్తి: బలి పాతాళప్రవేశం ..... 441
98. మహాభారతాన్ని పదిసార్లు పఠించాలి:విన్నా అంతే ఫలితం! ..... 445

# సంగ్రహసృష్టి వివరణ:దితి గర్భచ్ఛేదన

సత్రయాగ సందర్భం. నైమిశారణ్యంలో శౌనకాది మునులంతా సమావేశమయ్యారు. వారికి ఉగ్రశ్రవసుడు భారతాన్ని వినిపించాడు. వారంతా ఆనందపరవశులయ్యారు. అయినా తనివి తీరలేదెవరికీ. దాంతో ఉగ్రశ్రవసుణ్ణి పూజించి, చేతులు జోడించారు. నమస్కరించా రతనికి. వేడుకున్నారిలా.

పురాణవేత్తా! నువ్వు వినిపించిన భారతంతో మేమంతా ధన్యులం అయ్యాం. భారతవీరుల గురించి చెబుతూ నువ్వు అక్కడక్కడా అనేకమంది రాజుల పుణ్యచరిత్రలు కూడా వినిపించావు. దేవతలు, దైత్యులు, మునీశ్వరులు, యక్షులు, రాక్షసుల గురించి గొప్పగా చెప్పావు. ధర్మాధర్మాలన్నీ తెలియజేశావు. అయితే వైభవాలతో విలసిల్లిన యాదవాధీశ్వరుల చరిత్రలు భారతంలో కొంతమేరకే చెప్పావు. వారి గురించి ఇంకా విశేషంగా వినాలనిపిస్తున్నది. దయచేసి ఆ కథలు వివరంగా చెబితే ఆనందిస్తాం.

తప్పకుండా అన్నాడు ఉగ్రశ్రవసుడు. మునుల అభ్యర్థనకు ఆనందించాడు.

మీరు అడిగిన కథలే గతంలో జనమేజయునికి వైశంపాయనుడు వినిపించాడు. ఆ కథలే నేనిప్పుడు మీకు చెబుతాను, వినండి అన్నాడు. వినేందుకు మునులంతా సిద్ధ మయ్యారు.

భారతాన్ని సంపూర్ణంగా విన్నాడు జనమేజయుడు. ఆనందించాడు. ఆ తర్వాత వైశంపాయనుడికి నమస్కరించి ప్రార్థించాడిలా.

భారతాన్ని చెబుతూ నువ్వు అక్కడక్కడా అవసరం మేరకే యాదవాధీశ్వరుల కథలు చెప్పావు. వారి గురించి వివరంగా వినాలని ఆశగా ఉన్నది. దయచేసి చెబితే ఆనందిస్తాను.'

మహారాజా! నువ్వు అడగడమే ఆనందం. ఆ కథలన్నీ మహదానందంగా వినిపిస్తాను. విను. యాదవాధీశుల పవిత్ర కథనంతా 'హరివంశం' పేరిట కృష్ణద్వైపాయనుడు నాకు తెలియజేశాడు. అదే నీకు చెబుతున్నాను. ఇది విన్నవారికి శుభం కలుగుతుంది. అపార పుణ్యరాశి చేకూరుతుంది అన్నాడు వైశంపాయనుడు. చెప్పసాగాడిలా.

'ఆత్మ అనీ, ప్రకృతి అనీ రెండు తత్వాలను పరమాత్మ ముందుగా సృష్టించాడు. ఆ ప్రకృతి నుండే మహత్తు పుట్టింది. ఆ మహత్తు నుండి అహంకారం పుట్టింది. అహంకారం నుండి పంచభూతాలు పుట్టాయి. ఈ పంచభూతాల నుండే భూతవిశేషాలు అనేకం పుట్టాయి. ఇది సృష్టి సంగ్రహరూపం. తర్వాతవన్నీ దీని విస్తరణలే!

# వేనుని శరీరమథనం:పృథుదేవతల సంవాదం

సకలసృష్టి జరిగిన తీరును జనమేజయునికి వివరించాడు వైశంపాయనుడు. కాసేపు సేదదీరాడు. తర్వాత చెప్పాడిలా. మహారాజా! సమస్త ప్రాణికోటినీ దక్షప్రజాపతి సృష్టించిన అనంతరం, వారందరికీ అధీశ్వరులను ఏర్పరిచాడతను. ఆ అధీశ్వరుల పట్టాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించాడు. రాజులకు పృథుచక్రవర్తి అధినాథుడయ్యాడు. బ్రాహ్మణులకు, తారకులకు, తరువులకు, ఓషధులకు, యజ్ఞ యాగాలకు, తపస్సులకు చంద్రుడు అధిపతి అయ్యాడు. సంపదలకు, సాగరాలకు, రాజులకు కుబేరుడు అధిపతి అయ్యాడు. పిశాచాలకు శివుడు అధిపతి అయితే, అమరులకు ఇంద్రుడు అధిపతి అయ్యాడు. రాక్షసులకు ప్రహ్లాదుడు, పితృదేవతలకు అంతకుడు అధిపతులయ్యారు. నాగులకు వాసుకి, మిగిలిన సర్పజాతికి తక్షకుడు, పక్షులకు గరుడుడు, గంధర్వులకు చిత్రరథుడు, ఏనుగులకు ఐరావతం, గుర్రాలకు ఉచ్చైశ్రవం, మానవులకు నృపతి, పర్వతాలకు హిమగిరి, వాహినులకు సముద్రుడు ప్రభువులయ్యారు.

అధిపతులను నిర్ణయించిన అనంతరం దక్షప్రజాపతి పృథివి సమస్తాన్నీ నాలుగు ఖండాలుగా విభజించాడు. విభజించి తూర్పుదిశకు విరాటపుత్రుడు వైరాజును రాజుని చేశాడు. అలాగే దక్షిణ దిక్కుకు కర్దముని కొడుకు శంఖపదుణ్ణి రాజుని చేశాడు. పశ్చిమదిశకు రజఃపుత్రుడు కేతుమంతుని, ఉత్తరదిశకు పర్జన్య కుమారుడు హిరణ్యరోముణ్ణి రాజుని చేసి, వారికి పట్టాభిషేకాలు చేశాడు. ఈ నలుగురూ పృథివి మధ్యభాగానికి రాజయిన పృథువును తమ చక్రవర్తిగా అంగీకరించి, రాజ్యాలేలారు. కొంతకాలానికి చాక్షుష మన్వంతరం గడిచింది. అప్పుడు వైవస్వత మనువునకు ప్రపంచ సామ్రాజ్యాన్ని ప్రసాదించాడు బ్రహ్మ అని కాసేపాగాడు వైశంపాయనుడు. అతడు అలా ఆగడం గొప్ప అవకాశంగా భావించాడు జనమేజయుడు. అడిగాడిలా.

మునీంద్రా! నువ్వు ఇంతకు ముందు పృథుచక్రవర్తి గురించి చాలా సంగ్రహంగా చెప్పావు. దానిని నేను వివరంగా వినాలనుకుంటున్నాను. అసలు పృథుచక్రవర్తి జననం ఎలాంటిది? ఈ భూమిని అతను ధేనువుగా ఎలా మార్చాడు? ఆయన అనుమతితో ఎవరెవరు ఆ ధేనువు నుంచి ఏఏ వస్తువులు పిదుగుకున్నారు? ఆ వివరాలన్నీ నాకు కావాలి. వినాలని చాలా ఉత్సాహంగా ఉంది. దయచేసి వివరంగా వాటినన్నిటినీ వివరించు.

తప్పకుండా అన్నాడు వైశంపాయనుడు. వివరించాడిలా.

ఆదియుగంలో యమపుత్రిక సునీథకూ, అంగరాజుకూ వేనుడు జన్మించాడు. వేనుడు రాజయ్యాక తాతగారైన యమునితో చేతులు కలిపి, మహాక్రూరుడయ్యాడు. ప్రజలను అనేక విధాల హింసించసాగాడు. ధర్మమార్గాన్ని విడిచి, వేదవిరుద్ధంగా నడవసాగాడు. ఒకనాడు రాజ్యంలోని ప్రజలందరినీ సమావేశపరిచాడు. చెప్పాడిలా.

# తారాశశాంకం:రజిరాజు చరిత్ర

కొన్నాళ్ళకు కుమారుడు విష్వక్సేనునికి పట్టాభిషేకం చేసి, ఇద్దరుమంత్రులు, భార్యసహా అరణ్యవాసానికి బయల్దేరాడు బ్రహ్మదత్తుడు. ఆ సమయంలో అతని భార్య అన్నదిలా. ప్రభూ! నీకు సమస్త ప్రాణుల భాషలూ తెలుసునన్న సంగతి నాకు తెలుసు. కాని నువ్వు పూర్వజన్మవిజ్ఞానం విస్మరించి, భోగలాలసుడివి అయ్యావు. నిన్ను మార్చాలి, నిన్ను మార్చేందుకే నేనలా ప్రవర్తించాను. ఫలితంగా మనందరికీ శుభమే జరిగింది. సిద్ధపదవిలోనికి ప్రవేశిస్తున్నాం.

అవునవునన్నట్టుగా తలూపాడు బ్రహ్మదత్తుడు. కాన్సేపటికి కండరీకుడు ఓ దగ్గర నిలబడి, వేదరాశికి క్రమం ఏర్పరిచి, క్రమేపి సిద్ధమార్గంలో కృతార్థుడయ్యాడు. బాభ్రవ్యుడు వేదాలు అన్నిటికీ శిక్ష రచించి, ఉత్తమపదవి పొందాడు.

సనత్కుమారుడు చెప్పగా ఇదంతా భవిష్యత్ గాథగా మార్కండేయుడు గ్రహించాడు. దానంతటినీ తర్వాత ఆయన స్వయంగా చూశాడు. అలా చూసినదంతా నాకు చెప్పాడాయన. చెప్పి అన్నాడిలా.

భీష్మా! ఈ కథ విన్న నువ్వు ఎంతో ధన్యుడివి! దీనిని మననం చేయడం వల్ల నీకు శుభం చేకూరుతుంది. ఈ కథను హృదయంలో పదిలపరుచుకున్న వారెవరైనాసరే! చిరకాలం సుఖాలతో జీవిస్తారు.

ధన్యుణ్ణి అన్నాను నేను. మార్కండేయమహాముని తపోవనానికి వెళ్ళిపోయాడప్పుడు అని ముగించాడు భీష్ముడు. కృతజ్ఞతగా చేతులు జోడించి అతనికి నమస్కరించాడు ధర్మరాజు.

**(పూర్వభాగం:ద్వితీయఖండం సమాప్తం)**

తాను చెబుతున్నది శ్రద్ధగా వింటున్న జనమేజయునితో వైశంపాయనుడు అన్నాడిలా.

వృష్ణివంశాన్ని వివరిస్తూ నీకు ఈ కథలన్నీ చెప్పాను. ఇప్పుడు ఆ వృష్ణివంశానికి మూలమైన చంద్రవంశక్రమం వివరిస్తాను, జాగ్రత్తగా విను.

పరమేష్ఠి మానసపుత్రుడు అత్రిమహాముని లోక క్షేమంకోసం ధర్మనిష్ఠుడై చిరకాలం ఘోరతపస్సు ఆచరించాడు. మూడువేల దివ్యసంవత్సరాలు చేశాడలా. తపస్సు చేసినంతకాలం కనీసం కనురెప్పలు కూడా కదల్చలేదతను. రేతస్సును ఊర్ధ్వముఖంగా ప్రసరింపజేసి, అచంచలుడై నిలిచాడు. అప్పుడు అతని కళ్ళలోంచి కన్నీరు వెలువడింది. అది జాజ్వల్యమాన కాంతితో ప్రకాశించింది. అదే జాబిల్లి అనే చిన్నారి గర్భపిండమైంది.

దానిని పదిదిక్కులు కొంతకాలం భరించాయి. తర్వాత ఇక భరించలేక దానిని నేలపై జారవిడిచాయి.

బ్రహ్మదేవుడు అది గమనించాడు. వెంటనే ఆ పిండాన్ని వేయి తెల్లగుర్రాలు పూన్చిన రథంపై ప్రతిష్ఠించాడు. దేవతలంతా ఆ తేజోరాశిని చూసి 'సోముడు' అన్నారు. భృగువు,

# దేవదానవుల యుద్ధం:బడబాగ్ని జననం

అంతకు ముందే రాక్షసులతో దేవేంద్రుడు యుద్ధాన్ని ప్రారంభించాడు. ఇరువర్గాలూ బలంగా తలపడ్డాయి. ఎవరికెవరూ తీసిపోలేదు. కాసేపటికి దేవతలు వెనకడుగు వేయాల్సి వచ్చింది. రాక్షసులు వారిని గట్టిగా ఎదుర్కొన్నారు. అంతలో రథగజతురంగమాలు యుద్ధానికి సిద్ధమయ్యాయి. ఎడతెగని పోరాటం చేశాయి. వాటిని అదిలిస్తూ శూరభటులు చేసిన అరుపులు మిన్నంటాయి.

ఉభయవాహినులలోని వీరులు గాయపడడంతో అక్కడ రక్తం ఏరులై పారింది. రాక్షసనేతలు చాలామంది మరణించారు. మిగిలినవారు చనిపోయిన రాక్షసనేతలను చూసి తట్టుకోలేక పోయారు. కోపోద్రిక్తులయి తలపడ్డారు. దేవతలపై మాయాపాశాలను ప్రయోగించారు. విపరీతగర్వంతో గొంతెత్తి గర్జించారు. దేవతలకి కరచరణాలాడలేదు. అవయవాలన్నీ తాళ్ళతో కట్టినట్టుగా అనిపించి, కదలలేకపోయారు. వారిలాగే రథగజాశ్వాలు ఎక్కడివక్కడే నిలబడిపోయాయి. ప్రాణభీతితో దేవతలంతా గజగజలాడారు. గమనించాడది దేవేంద్రుడు. శత్రువుల మాయను పటాపంచలు చేసేందుకు అనేక బాణాలను ఒక్కసారిగా ప్రయోగించాడు. ఆ బాణాలన్నీ ఆకాశాన్ని కప్పేశాయి. అంతటా చీకటి అలముకుందప్పుడు. ఆ చీకటిలో దానవులు తమవారెవరో, పైవారెవరో తెలుసుకోలేక తికమకపడ్డారు. అదే అదునుగా దేవతలు విజృంభించారు. దానవులను సంహరించారు.

జరుగుతున్న దానిని చూసి రోషభీషణాక్షుడైపోయాడు మయాసురుడు. నేత్రాంతాలతో శత్రువులపై 'ఔర్యం' అన్న మహామాయ ప్రయోగించాడు. అది జ్వాలలా లేచి, దేవేంద్రుడు సృష్టించిన చీకటిని తుత్తునియలు చేసింది. అనేకమంది దేవతలను అతలాకుతలం చేసింది. వారి ప్రాణాలు బలిగొంది. ఇంకా జ్వలిస్తూ పైపైకి రావడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని దేవతలంతా పరుగుదీశారు. జ్వాలకు అందక సముద్రజలాల్లో దాగున్నారు. ప్రాణాలు కాపాడుకున్నారు. ప్రజ్వరిల్లుతున్న జ్వాలను అడ్డగించేందుకు ఏం చెయ్యాలో తోచలేదు దేవేంద్రునికి. వరుణదేవుణ్ణి సమీపించాడు. జ్వాలను ఆర్పివేసే ఉపాయం తెలియజేయమన్నాడు. తన అశక్తతను తెలియజేశాడు వరుణదేవుడు. ఆ మహాగ్ని జ్వాల కథంతా తెలియజేశాడిలా.

పూర్వం ఔర్వుడు అన్న మహాముని బ్రహ్మచర్యం స్వీకరించి, చాలా ఏళ్ళపాటు తపస్సు ఆచరించాడు. ఆ తాపాన్ని లోకాలు భరించలేకపోయాయి. తల్లడిల్లాయి. దేవతలు, ఋషీశ్వరులు, హిరణ్యకశిపుడు మొదలైన రాక్షసులు ఆ తాపాన్ని తట్టుకోలేకపోయారు. ఆందోళన చెందారంతా. పరుగున వచ్చి ఔర్వుణ్ణి సమీపించారు.

మహామునీ! చిన్ననాటినుండి నువ్వు ఇలా బ్రహ్మచర్యవ్రతాన్ని పాటిస్తే నీ వంశం ఏమవుతుందో ఆలోచించావా? నిర్వంశం అయిపోతుంది. తపశ్చర్యకు ఇది అవసరం లేదు. గొప్పగొప్ప మునిపుంగవులంతా గృహిణీసమేతులై ఉండడం నీకు తెలియంది కాదు. దయచేసి పెళ్ళి చేసుకో! మేము నీ మంచికే చెబుతున్నాం అన్నారు. దానికి ఔర్వుడు సన్నగా నవ్వి అన్నాడిలా.

# భూదేవి విజ్ఞప్తి: శంతనుని జననం

హరివంశం పవిత్రగాథను జనమేజయునికి తిరిగి చెప్పసాగాడిలా వైశంపాయనుడు. మహారాజా! శ్రీమన్నారాయణుడు ఆ రకంగా యోగనిద్రా పరవశుడైన వేళ కృత త్రేతాయుగాలు రెండూ గడచిపోయాయి. మూడవయుగమైన ద్వాపరం గడచినకొలదీ ప్రజల భారం మోయలేక భూదేవి గొంతెత్తి ఆక్రోశించింది. దేవతలు ఆ ఆక్రోశం విని జాలిచెందారు. భూదేవి రోదనను బ్రహ్మకు విన్నవించారు. అప్పుడు దేవతలుసహా బ్రహ్మ, శ్రీమహావిష్ణువును సమీపించి, అతన్ని భక్తి ప్రపత్తులతో ప్రస్తుతించాడు. స్తోత్రాలు ఆలకించి దేవాధిదేవుడు మేలుకున్నాడు. మెల్లమెల్లగా కళ్ళు తెరచి తనని సమీపించిన దేవతలను చూశాడు. ఆశ్చర్యపోయాడు. అడిగాడిలా.

మహామహులంతా మూకుమ్మడిగా ఇక్కడికి రావడానికి కారణం ఏమిటి? లోకాలకు ఎలాంటి ఆపదా కలగలేదు కదా? రాక్షసాధములు తిరిగి విజృంభించలేదుకదా?

ఏం చెప్పాలో, ఎలా ప్రారంభించాలో తెలియక చేతులు రెండూ జోడించి ముందు విష్ణువుకి నమస్కరించాడు బ్రహ్మ. తర్వాత విన్నవించాడిలా.

పురుషోత్తమా! మా విన్నపాన్ని కరుణార్ద్రహృదయంతో నువ్వు ఆలకించాలి. భూలోకంలో రాజులంతా పరమధార్మికదృష్టితో పరిపాలిస్తున్నారు. ప్రజలను కన్నబిడ్డల్లా చూసుకుంటున్నారు. యుద్ధాలు లేవు. న్యాయ సత్యాలను విడనాడడం లేదెవరూ. పంటలో ఆరవపాలు మాత్రమే పన్నుగా స్వీకరిస్తున్నారు. అలాగే మిత్రులను, బాంధవులను, అమాత్యులను సదా పోషిస్తున్నారు. యజ్ఞయాగాదులతో దేవతలకు, భూదేవతలకు, పితృదేవతలకు మనస్సంతృప్తి కలిగిస్తున్నారు. సకలవర్ణాలవారు శ్రద్ధగా తమతమ ధర్మాలను నిర్వర్తిస్తున్నారు. దాంతో రోగాలుగానీ, ముసలితనంగానీ, మృత్యువుగానీ ప్రజల్ని హింసించడం లేదు. ఈ కారణంగా లోకంలో మానవులు అత్యధికంగా పెరిగిపోయారు.

అంతేకాదు స్వామీ! ఏ నగరాన్ని పరిశీలించినా అక్కడి రాజుల పదాతి గజాశ్వబలాలు కోట్లకొలదిగా పెరిగిపోయి ఉన్నాయి. అలాగే పిల్లాపాపలతో జనపదాలసంఖ్య కూడా మించిపోతున్నది. మానవలోకం యావత్తు కృతయుగంలో అభివృద్ధి చెందినట్టుగా చెందుతోంది. జనభారాన్ని భూదేవత భరించలేకపోతోంది. గొంతెత్తి ఆక్రోశిస్తోంది. తాను కదలలేనిదైనా, విపరీతమైన శోకంతో సర్వదా సంచరిస్తున్నది అని ఆగాడు బ్రహ్మ. కూడా ఉన్న దేవతలవైపు చూశాడు. వారంతా చెప్పమన్నట్టుగా చేతులు జోడించారు. అప్పుడు మళ్ళీ చెప్పసాగాడిలా బ్రహ్మ.

దేవాధిదేవా! సూక్ష్మంగా అదీ విషయం. ధర్మానికి హాని కలగకుండా అత్యధిక సంఖ్యలో ఉన్న రాజులను సంహరించి, భూభారాన్ని తగ్గించాల్సిందిగా వేడుకుంటున్నాం. నువ్విక ఈ యోగనిద్ర చాలించి, మేరుపర్వతానికి విజయం చేయాల్సిందిగా కోరుకుంటున్నాం. మేరు

# కంసుడుగా కాలనేమి:వసుదేవుడుగా కశ్యపుడు

బ్రహ్మదేవుడు వినిపించిన కథనానికి దేవతలంతా ఆనందించారు. అతన్ని అనేక విధాల ప్రశంసించి, అభినందించారు. అంతలో అక్కడకి నారదుడు వచ్చాడు. అతని రాకకు ఆశ్చర్యపోయారు దేవతలు. రాదగిన సమయంలోనే వచ్చాడని నమస్కరించారతనికి. సకలలోక సదాహితైషి నారదుడు వస్తూనే విష్ణుదేవునికి నమస్కరించాడు. అతని సమీపంలో కూర్చున్నాడు. తన మనోజ్ఞమైన వీణాగానంతో సభాసదులందరినీ ఆనందింపజేశాడు. విష్ణుదేవుడు కూడా ఆ వీణాగానానికి మైమరచి కళ్ళు మూసుకున్నాడు. కాస్సేపటికి వీణాగానాన్ని ఆపి, విష్ణుదేవుణ్ణి ఉద్దేశించి అన్నాడిలా నారదుడు.

లోకాధినాయకా!

కళ్ళు తెరచి చూశాడు విష్ణుదేవుడు.

మతిమంతులలోనూ, మహాశక్తిమంతుల్లోనూ నువ్వు ప్రథముడివి! మహాధైర్యశాలివి! ఈ లోకం అంతా నీ లీలావిలాసం. నువ్వు తక్షణం నీ అంశతో భూలోకంలో అవతరించాలి. అవతరించని పక్షంలో ఈ దేవతలంతా అక్కడ అవతరించడం అనవసరం. దివ్యాంశతో నువ్వు భూమిపై అవతరించినప్పుడే ఈ దేవతలకు కూడా రక్షణ దొరుకుతుంది. దుష్టశిక్షణ నీ వల్లే జరగాలి. నువ్వే అందుకు సమర్థుడివి!

సన్నగా నవ్వుతూ చూడసాగాడు విష్ణువు.

విష్ణుదేవా! ఈ సందర్భంలో నీకొక విషయం చెప్పాల్సి ఉన్నది. భూలోకంలో క్షత్రియ వినాశనమే కాదు, మీరంతా మరొక కార్యం కూడా చేయాల్సి ఉన్నది. ఆ కార్యం నీవు లేకుండా ఈ దేవతలు చేయలేరక్కడ. ఆ విషయం చెప్పేందుకే నేను ఇక్కడకు వచ్చాను. దయచేసి నా విజ్ఞప్తి విను.

చెప్పు అన్నట్టుగా కళ్ళెగరేశాడు విష్ణువు. చెప్పసాగాడిలా నారదుడు.

తారకామయుని సంగ్రామంలో నువ్వు సంహరించిన దానవులందరూ తిరిగి మర్త్యలోకంలో జన్మించారు. జన్మించి, యజ్ఞయాగాదులకు అంతరాయాలు కలిగిస్తున్నారు. రామావతారంలో రావణవధానంతరం అతని మేనల్లుడు లవణాసురుడు యమునాతీరంలో ఓ అరణ్యంలో దాగున్నాడు. అక్కడ మునులందరినీ అనేక విధాల హింసించాడు. వాడు మధురాక్షసుని కుమారుడు. బలపరాక్రమశాలి. లవణాసురుని బాధలు భరించలేక, అక్కడి మునులంతా రాముణ్ణి ఆశ్రయించారు. రక్షించమని వేడుకున్నారు. రాముడు అప్పుడు లవణాసురుణ్ణి వధించమని శత్రుఘ్నుణ్ణి ఆదేశించాడు.

అన్న ఆజ్ఞ శిరసావహించి లవణాసురునిపై దాడి చేశాడు శత్రుఘ్నుడు. వధించాడతన్ని. అక్కడి అరణ్యాన్ని నిర్మూలించాడు. ఆ స్థానంలో మనోహరనగరాన్ని నిర్మించాడు. మధుదైత్యుని వనం నిర్మూలించి నిర్మించిన కారణంగా ఆ నగరాన్ని అంతా 'మధుర' అని వ్యవహరించారు.

# ప్రలంబాసుర సంహారణ:పర్వతార్చన

కొద్దిరోజులు గడిచాయి. ఒకనాడు అన్న బలరాముడు, బావమరిది శ్రీధాముడు, మిత్ర బృందం సహా మర్రిచెట్టునీడకు చేరుకున్నాడు కృష్ణుడు. ఆలమందలు దూరంగా ఉన్నాయి. మేస్తున్నాయి అక్కడ. వాటిని మాగన్నుగా చూస్తూ ముచ్చట్లాడుతున్నాడు కృష్ణుడు. అదే అవకాశంగా ప్రలంబాసురుడు అనే రాక్షసుడు, కృష్ణుని మిత్రబృందంలో చేరే ప్రయత్నాల్లో పడ్డాడు. గోపాలకుని వేషం కట్టాడు. ఎవరూ గుర్తించని విధంగా తయారయ్యాడు. వచ్చి మిత్రబృందంలో ఒకనిగా కూర్చున్నాడు. ముచ్చట్లలో మాట కలిపాడు. బలరామకృష్ణుల అంతు చూసేందుకు ఇంతకన్నా గొప్ప ఆలోచన మరొకటి లేదనుకున్నాడు. అయినదానికీ, కానిదానికీ నవ్వుతూ అందరి దృష్టినీ ఆకర్షించాడు.

కాసేపటికి అంతా హుషారయ్యారు. ఆడుకునేందుకు సిద్ధమయ్యారు. రెండు జట్లుగా విడిపోయారంతా. ఒకజట్టుకి శ్రీధాముడు అధినాయకుడు అయితే, ఇంకొకజట్టుకి కృష్ణుడు అధినాయకుడయ్యాడు. దూరం నుంచి లేళ్ళలా పరుగుదీసి వచ్చి, మర్రిచెట్టును ముట్టుకోవాలి. ముందుగా ముట్టుకున్నవారు గెలిచినట్టు. లేనివారు ఓడినట్టు. రెండు జట్లూ పరుగుకు సిద్ధమయ్యాయి. శ్రీధామునిజట్టులో ఉన్నాడు ప్రలంబాసురుడు. వాడు బలరామునికి ప్రత్యర్థిగా నిలిచాడు. ఇటు కృష్ణుడూ, అటు శ్రీధాముడూ ఒకేసారి 'ఓం' అన్నారు. వారు అలా అనగానే ఇరుజట్లూ పెద్దగా కేకలు వేసుకుంటూ పరుగందుకున్నాయి. కృష్ణుడు జట్టే ముందుగా వెళ్ళి మర్రిచెట్టుని ముట్టుకుంది. దాంతో శ్రీధామునిజట్టు ఓడిపోయింది. ఓడిపోయినవారు ప్రత్యర్థిని వీపున మోస్తూ పరుగుదియ్యాలి. బలరాముణ్ణి, ప్రలంబాసురుడు మోయాల్సివచ్చింది. అలా మోయాల్సి రావడం తన అదృష్టంగా భావించాడు ప్రలంబాసురుడు. అదే అవకాశంగా బలరాముణ్ణి మట్టుబెట్టాలనుకున్నాడు. జాగేలనండి! మొయ్యండి! మొయ్యండి! పరుగుదియ్యండి అంటే ప్రత్యర్థుల్ని మోశారంతా. వీపున మోసుకుని పరుగుదీశారు. వచ్చిన అవకాశాన్ని వదులుకోరాదు. శత్రువును చేజారనీయరాదనుకున్నాడు ప్రలంబాసురుడు. బలరాముణ్ణి ఆకాశానికి ఎత్తుకుపోయి, అక్కడ అతన్ని సంహరించడం బాగుంటుంది అనుకున్నాడు. అనుకున్నదే ఆలస్యం, ప్రలంబాసురుడు నిజరూపం ధరించాడు. బలరాముణ్ణి సందిట బిగించి ఆకాశానికి ఎగిశాడు. తానుండాల్సింది గోపకుమారుని వీపున. ఉన్నది రాక్షసుని సందిట. ఇదెలాసాధ్యం? అయోమయానికి గురయ్యాడు బలరాముడు. భయపడ్డాడు. ఆక్రోశించాడిలా.

కృష్ణా! ఈ రాక్షసుడెవడో గోపాలుడిలా వచ్చి, నన్ను తస్కరించుకుని పారిపోతున్నాడు. భయంగా ఉంది. ఏం చెయ్యనిప్పుడు? ఎలా వీడినుండి బయటపడను? ఊపిరి ఆగిపోతోంది, ఉపాయం చెప్పు తమ్ముడూ!

బలరాముణ్ణి తీసుకుని ఆకాశానికి ఎగిసిపోతున్న ప్రలంబాసురుణ్ణి చూశాడు కృష్ణుడు. అరచి చెప్పాడిలా.

# విప్రవనితల అన్నప్రదానం:మోహావేశం

శృంగారవతులారా! మీకెందుకు అంత సిగ్గు? నేనెవరు? చిన్నప్పటి నుండీ మీతో ఆడి పాడి పెరిగినవాణ్ణేకదా? పైగా మీ అంతరాంతరాన ఉన్నది నేనేకదా? మీలో నాకు తెలియంది లేదు. కాత్యాయనీ వ్రతాన్ని అంత నిష్ఠగా ఆచరించి, నియమాలు పట్టించుకోకుండా వివస్త్రలై నీటిలో ప్రవేశించారే, ఎంత తప్పు చేశారు? వ్రతఫలితాన్ని చేజేతులా వదలుకుంటారా, చెప్పండి.

వదలుకోలేం అన్నట్టుగా తలలాడించారు గోపికలు. జాలిగా చూశారు.

అయితే వ్రతఫలితం అందాలంటే... చక్కగా చేతులెత్తి నాకు నమస్కరించండి! మీమీ దుస్తులు తీసుకోండి అన్నాడు కృష్ణుడు.

వివస్త్రలై నీటమునిగిన కారణంగా వ్రతఫలితం అందకుండాపోతోందిట! ఎంతపని చేశాం? చేసిన తప్పులు చాలు! చేతులెత్తి నమస్కరిద్దాం అనుకున్నారు గోపికలు. కృష్ణుడు చెప్పినట్టుగానే నుదుటన చేతులు ఉంచుకుని, భక్తిపూర్వకంగా నమస్కరించారతనికి. వ్రతాన్ని మధ్యలో వదలివేసినా, గోవిందనామస్మరణతో వ్రతఫలితం ఇట్టే సంప్రాప్తిస్తుంది. అలాంటిది గోవిందుణ్ణి కట్టెదుట చూస్తోంటే వ్రతఫలితం అందకుండాపోతుందా? ఆ సంగతి తెలియని గోపికలు, కృష్ణుడు చెప్పినట్టుగానే నమస్కరించి, వ్రతఫలితం కోల్పోలేదనుకున్నారు. కృష్ణుడప్పుడు ఎవరిదుస్తులు వారికి అందించాడు. దుస్తులు దొంగిలించినా, నవ్వినా, నవ్వులపాలు చేసినా వ్రతఫలితాన్ని అందించాడు కృష్ణుడు. చాలది. అందుకు అతనికి ఋణపడి ఉండాలనుకున్నారు గోపికలు. అమందానందభరితులయ్యారు. కపటంగా ప్రవర్తించవచ్చు. మనసులు నొప్పించ వచ్చు. పరిహసించవచ్చు. ప్రాణేశ్వరుడు ఏది చేసినా, అది కామినులకు అందమే కదా!

కృష్ణుడు అందించిన దుస్తులు ధరించారు గోపికలు. అంతులేని అనురాగంతో చూశారతన్ని. వారి మనసులోని కోరిక తెలిసిన కృష్ణుడు, వారితో అన్నాడిలా.

సుందరాంగులారా! మీరు చెప్పకపోయినా మీ మనసులోని కోరిక నాకు తెలుసు. ఎప్పుడూ నన్నే ఆరాధించాలన్న మీ అభిమానమూ, మీ నోమూ తప్పక ఫలిస్తాయి. నన్ను ఆరాధిస్తే మోక్షమే ప్రసాదిస్తాను, అలాంటిది మీ చిన్నపాటికోరికను నేను తీర్చలేనా చెప్పండి. మీ కాత్యాయనీవ్రతం సంపూర్ణంగా ముగిసిన తర్వాత నా సాంగత్యభాగ్యం మీకు తప్పక లభిస్తుంది. వెళ్ళిరండి.

కృష్ణుని మాట చాలు! కోరికలకోట సాధించినట్టేననుకున్నారు గోపికలు. దేవదేవుని రూపాన్నేకాదు, అతని పాదపద్మాలను కూడా మనసులో ధ్యానించుకుంటూ వారంతా ఇంటిదారిపట్టారు.

గోపికలు అటు వెళ్ళగానే ఇటు మిత్రులను సమీపించాడు కృష్ణుడు. వారితో గోపరిపాలన చేస్తూ, గోవర్ధనగిరి దాటాడు. ముందుకు వచ్చాడు. ఆసరికి సూర్యుడు గగనమధ్యంలో

# బలరామకృష్ణుల నిష్క్రమణ:గోమంత సందర్శనం

మధురపైకి జరాసంధుడు దండెత్తి వస్తున్నాట్ట! అన్నదమ్ముల ఆలోచనలేమిటో? తెలుసుకునేందుకు మధురలోని పెద్దలంతా ఉగ్రసేనుణ్ణీ, బలరామకృష్ణులనీ కలిశారు. మంతనాలు ఆరంభించారు. పెద్దలలో వికద్రుడు అని ఓ వృద్ధుడు ఉన్నాడు. అతను కృష్ణునితో చెప్పాడిలా.

కృష్ణా! యదుకులంలో నువ్వు బ్రహ్మలా జన్మించావు. జన్మించి, మన యాదవకులం భయభ్రాంతులన్నీ తొలగిస్తున్నావు. నువ్వు ఆ దేవేంద్రాదుల ఆలోచనలు కూడా ఇట్టే తెలుసుకోగలిగే సమర్థుడివి. అందులో అనుమానంలేదు. అయితే ఇక్కడ ఓ విషయం నీకు తెలియజేయడం నా బాధ్యతగా భావిస్తున్నాను. జరాసంధునికి అనేకమంది రాజుల సాయం ఉంది. దాంతో అతను గర్వంతో విర్రవీగుతున్నాడు. పైగా కపటోపాయాలలో అతను దిట్ట. ఎలాంటి క్రూరత్వానికైనా వెనుదీయడు. అలాంటివాణ్ణి నువ్వు తప్ప ఇంకొకరు ఎదుర్కొనలేరు. అయితే మన దుర్గసంరక్షణవిషయం గురించి నువ్వు తప్పనిసరిగా తెలుసుకోగలగాలి అని ఆగాడు.

ఏం, మన దుర్గాలు అంత పటిష్టంగా లేవా? అడిగాడు కృష్ణుడు. వికద్రుడు ఆగాడు అంటేనే అతనికి అనుమానం కలిగింది.

లేవు అన్నాడు వికద్రుడు. చెప్పసాగాడిలా.

ఈలోకంలో తనని ఇక ఎవరూ ఎదిరించలేరన్న గట్టి నమ్మకంతో కంసుడు దుర్గసంరక్షణను పెద్దగా పట్టించుకోలేదు. దాంతో అది పాడుబడింది. మధురాపురప్రాకారము, కోటబురుజులు పూర్తిగా శిథిలమయ్యాయి. ఆయుధాలూ, ధనధాన్యాలు కూడా చాలినంతగా లేవు. శత్రువు అకస్మాత్తుగావచ్చి ముట్టడిస్తే, వారిని ఎదుర్కొనేందుకు సరైన సాధనసంపత్తి లేక మనవారు లోపల ఉండిపోయారనుకో! కోట శత్రువు వశమైనట్టే! కోట శత్రువు వశమైతే రాజూ, రాజ్యమూ పోయినట్టే!

అవునవును అన్నాడు బలరాముడు.

మరోవిషయం. జాగ్రత్తగా విను అన్నాడు వికద్రుడు. కృష్ణునికి చెప్పసాగాడిలా.

దక్షిణాపథంలో వింధ్యము, ఋక్షవంతము, సహ్యములని ప్రఖ్యాతపర్వతాలు మూడు ఉన్నాయి. వాటిపై దట్టమైన అడవులు ఉన్నాయి. ఆ ప్రాంతంలో ముచికుందుడు, పద్మవంతుడు, సారసుడు, హరితుడు అని యదువంశభూపతులు నలుగురు, శత్రువులకు అభేద్యమైన అనేక దుర్గాలు నిర్మించారు. వారిలో పెద్దవాడే ఈ మధురాపురాన్ని పాలించాడు. అతడు ఆనాడు నిర్మించిన ఇక్కడి దుర్గానికి ఎంతో పేరుప్రఖ్యాతులు వచ్చాయి. అలాగే అతని అన్నదమ్ములు నిర్మించిన దుర్గాలకుకూడా మంచి పేరున్నది. అయితే ఇప్పుడవన్నీ శిథిలమయ్యాయి. వాటిలో ఉండడం ఎంతమాత్రమూ క్షేమకరం కాదు. యుద్ధవేళ అన్నివిధాలా ప్రముఖులకు అరణ్యమార్గమే శరణ్యమనిపిస్తోంది.

# బలరామ జరాసంధుల గదాయుద్ధం

రుక్మిని ఎదుర్కొన్నాడు శ్రీకృష్ణుడు. ఇరవై అయిదు బాణాలు ఒకసారి, ముప్పయి రెండు బాణాలు ఒకసారి అతనిమీద ప్రయోగించాడు. బాధించాడతన్ని. యాభైయేడు బాణాలు ఒకదాని తర్వాత ఒకటిగా వచ్చి పడుతోంటే, జాగ్రత్తగా వాటిని ఎదుర్కొన్నాడు రుక్మి. ముందు నాలుగైదు బాణాలకు గాయాలపాలైనా తర్వాతి బాణాలకు తగిన సమాధానం చెప్పాడతను. ఆ బాణాలను మధ్యలోనే ముక్కలు ముక్కలు చేశాడు. చేసి, కృష్ణుని ధనుస్సును విరిచే ప్రయత్నం గట్టిగా చేశాడు. అయితే అది అతనివల్ల కాలేదు. కృష్ణునివల్ల అయింది. కృష్ణుని బాణాలకు రుక్మి విల్లు విరిగిపోయింది.

విల్లు విరిగిపోవడంతో విలవిల్లాడలేదు రుక్మి. శక్తిని తీవ్రవేగంతో కృష్ణునిపై ప్రయోగించాడు. శక్తిని మధ్యలో అడ్డుకున్నాడు కృష్ణుడు. భల్లబాణంతో దానిని అంతదూరంలో అడ్డుకుని, ఛిన్నాభిన్నం చేశాడు. గొంతెత్తి గర్జించాడు. పరిఘ, గదాయుధాలు ప్రయోగించాడు రుక్మి. వాటిని కూడా నేలపాలుచేశాడు కృష్ణుడు. నేలపాలు చేసి యాదవవీరుల జయాభినందనలు అందుకున్నాడు. ఆ అభినందనల వెల్లువలోనే రుక్మి రథాశ్వాలను నేలకూల్చాడు కృష్ణుడు. సారథిని సంహరించాడు. కేతనాన్ని చించి ముక్కలుచేశాడు. విజయశంఖం పూరించాడు.

విరథుడిగా ఉన్న రుక్మిని కూడా సంహరించేవాడే కృష్ణుడు. కాకపోతే అతని చెల్లెలు రుక్మిణిని తాను వివాహం చేసుకునే అవకాశం ఉన్నదని గ్రహించి, వదిలివేశాడతన్ని. రుక్మిని వదలి, మిగిలిన ప్రత్యర్థులపై శరవర్షం కురిపించాడు కృష్ణుడు.

భీష్మకుణ్ణి గట్టిగానే ఎదుర్కొన్నాడు ఉగ్రసేనుడు. ఇరవై అయిదు బాణాలను ఒకేసారి ప్రయోగించి, భీష్మకుణ్ణి గాయపరిచాడతను. వాహినికి మహోత్సాహం కలిగించాడు. తనపై దూసుకువస్తున్న బాణాలను అడ్డుకుని, వందలకొలది బాణాలను ప్రయోగించాడు భీష్మకుడు. ఉగ్రసేనుణ్ణి విలవిల్లాడించి, గొంతెత్తి గర్జించాడు. దెబ్బతిన్న పులిలా విజృంభించాడప్పుడు ఉగ్రసేనుడు. నిరంతరబాణవర్షంతో భీష్మకుని అశ్వాలను కూల్చాడు ముందు. తర్వాత అతని సారథిని చంపాడు. ఆ తర్వాత అతని కేతనాన్ని కూల్చి నేరుగా భీష్మకుని గుండెకు బాణాన్ని గురిపెట్టాడు. యుద్ధరంగంలో ఇక క్షణకాలం నిలిచినా మరణం తప్పదనిపించి, అక్కణ్ణుంచి పరుగందుకున్నాడు భీష్మకుడు. ప్రాణభయంతో వేరేచోటుకి చేరుకున్నాడు. కృష్ణునిపై క్రథుడు విజృంభించాడప్పుడు. ఏడుబాణాలు ప్రయోగించి, కృష్ణుణ్ణి బాగా నొప్పించగలిగాడు. కృష్ణుడు బాధగా మెలికలు తిరుగుతోంటే క్రథునిసైన్యం అత్యుత్సాహంతో కేకలు వేసింది. ఆనందంగా కరతాళధ్వనులు చేసింది. అంత బాధలోనూ ఎదురు తిరిగాడు కృష్ణుడు. వరుసగా బాణాలు ప్రయోగించి, అతని అశ్వాలను నేలకూల్చాడు. సారథిని సంహరించాడు. కేతనాన్ని కూల్చాడు. నేలపై నిరాయుధునిగా నిల్చున్నాడు క్రథుడు. అయినా ఎదుర్కొనేందుకు మీదికి వస్తోంటే తప్పనిసరై శరపరంపర కురిపించాడు కృష్ణుడు. ఆ ధాటిని తట్టుకోలేకపోయాడు క్రథుడు. తోటిరాజులు నిలునిలుమంటున్నా వినిపించుకోక, యుద్ధరంగాన్ని విడచి దూరంగా

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Hari+Vamsamu**

* * *